క్లుప్తంగా

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి



పటమట(విజయవాడతూర్పు): నగర వాసుల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ఆయన వినతులు స్వీకరించారు. ఆయా శాఖాధిపతులు ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సంతృప్తికరమైన పరిష్కారం చూపిన తర్వాతే ఆన్‌లైన్‌లో ముగింపు ఇవ్వాలని సూచించారు. మొత్తం 9 ఫిర్యాదులు రాగా అందులో నాలుగు పట్టణ ప్రణాళిక, మూడు, ఇంజినీరింగ్, ప్రజారోగ్యంపై ఒక్క ఫిర్యాదు వచ్చాయి.

క్రీడల్లో ప్రావీణ్యం పెంచుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని శ్రీ చైతన్య కళాశాల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీ కృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాలలో సోమవారం క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము శ్రీచైతన్య కళాశాల విద్యార్థులకు అన్ని క్యాంపస్‌ల్లో కబడ్డీ, ఖోఖో, షార్ట్‌పుట్, బాడ్మింటన్, త్రోబాల్, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఏజీఎం, డీన్, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చవితి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ రమాదేవి నగరపాలకసంస్థ పాఠశాల సమీపంలోని నాగ గణపతి వినాయక చవితి వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. బోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో నాగ గణపతిని ఉంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, తీన్‌మార్ నృత్యాలతో మధురానగర్ పురవీధుల మీదుగా ఊరేగించారు. దారి పొడవునా భక్తులు గణనాథుడికి హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. అనంతరం నాగ గణపతిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

దుర్గమ్మకు స్వర నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విశాఖపట్నంకు పలువురు కళాకారులు స్వర నీరాజనాలు అర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఎస్. లక్ష్మీపూసన, ఎస్. కృష్ణ ప్రియా పలు కీర్తనలు ఆలపించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన సంగీత విభావరికి భక్తులు ఆద్యంతం ఎంతో తన్మయంతో విని పులకించారు. వీరికి అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, రాంజీలు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందచేశారు.

సప్తగిరి వాసునికి స్వరనీరాజనం

విజయవాడ కల్చరల్: సామగాన లహరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో తిరుమల శ్రీనివాసుని నిలయం వివాదాల నేపథ్యంలో వివాదం మిగిసిపోవాలని కాంక్షిస్తూ లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం శ్రీవారికి అపరాధ క్షమాపణ సంగీత ఉపచారం నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు విద్వాంసులు, వాగ్గేయకారులు శ్రీనివాసుని వైభవంపై రచించిన సంకీర్తనలను మధురంగా గానం చేశారు. అపరాధములు మన్నించి, వేంకటాచల నిలయం వైకుంఠవాసం, శరణు శరణు సురేంద్ర వల్లభతోపాటు సప్తగిరి సంకీర్తనలను గానం చేశారు. ఉయ్యూరుకు చెందిన జ్యోతి శ్రీదేవి, ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్, మల్లాది నాగలక్ష్మి, సింధూ రాజేశ్వరి, మల్లాది సోదరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఉయ్యూరు: పుల్లేరు కాలువలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు..విజయవాడ సత్యనారాయణపురం ప్రాంతంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన నంద్యాల తేజ (23) ఈనెల 22న వ్యక్తిగత కారణాల రీత్యా స్నేహితులతో కలిసి ఉయ్యూరు బస్టాండ్ సమీపానికి చేరుకున్నానని తల్లిదండ్రులకు లొకేషన్ కూడా షేర్ చేశాడు. కంగారు పడ్డ తల్లిదండ్రులు సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉయ్యూరు బస్టాండు సమీపానికి రాగానే పుల్లేరు కాలువ పక్కన యువకుడు నడుపుకుంటూ వచ్చిన బైక్ కనిపించింది. వెంటనే ఉయ్యూరు పోలీసుల సమన్వయంతో పుల్లేరు కాలువలో గాలింపులు జరిపారు. కాలువలో తేజ మృతదేహం లభ్యమైంది. సత్యనారాయణపురం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవో 85ను తక్షణమే రద్దు చేయాలి

ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్



దర్నా చౌక్ వద్ద డాక్టర్ల నిరసన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటా కుదిస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆందోళన చేపట్టారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవో రద్దు చేయాలని సోమవారం ధర్నా చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖకు నష్టం చేసేలా ఉన్న జీవో నెంబర్ 85ను రద్దు చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యూనస్ నీర్ డిమాండ్ చేశారు. జీవో తీసుకువచ్చి ఇన్ సర్వీస్ కోటాను తగ్గించడం సరికాదన్నారు. ఎంతో కాలంగా ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కరోనా సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు రోగులకు విశేష సేవలు అందించారని గుర్తు చేశారు. నిర్దేశిత పరీక్షకు కేవలం 20 రోజుల ముందు ప్రభుత్వం ఇన్సర్వీస్ కోటాను కుదిస్తూ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. జీవో 85పై తాము జూలై 23న వైద్య శాఖ ప్రధాన కార్యదర్శి, ఆ తర్వాత సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌కు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. అయినా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాలేదన్నారు. దీంతో అనివార్య పరిస్థితుల్లో ఆందోళన బాటపట్టామన్నారు. జీవో 85 రద్దు చేసి.. ఇప్పటికే గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న వైద్యులకు మరిన్ని పీజీ సీట్లు ఇవ్వడం వల్ల మొత్తం ఆరోగ్య వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే జీవోను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ బాలాజీ, పలు పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సీనియర్ జర్నలిస్ట్ ప్రిన్స్ అన్నారు. ప్రిన్స్ మెలోడీస్ ఆధ్వర్యంలో బాలు స్వర సప్తాహం కార్యక్రమంలో భాగంగా సోమవారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి పురస్కారాలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. సభను ప్రారంభించిన ప్రిన్స్ మాట్లాడుతూ కళాకారులు నిజమైన సాంస్కృతిక వారసులని వారి సేవలను సమాజం గుర్తించాల్సిన అవసముందని అన్నారు. కామేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు ప్రిన్స్ మెలోడీస్ సామాజిక సేవలను వివరించారు. చలన చిత్ర దర్శకుడు, గాయకుడు శ్రీకాంత్‌కు స్వరవీర పురస్కారం, సినీ రంగస్థల నటుడు మనోజ్‌కు నటశూర, సినీ నేపథ్య గాయని మహతికి స్వరవాణి, సామాజిక సేవకురాలు సుజాతకు విహారి పురస్కారం ప్రదానం చేశారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, డేవిడ్ రాజు, డీవీ వీరభద్రరావు, వెంకాయమ్మ, జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనా రామన్, పరచూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు బాలు చిత్రగీతాలను మధురంగా ఆలపించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సబ్‌స్టేషన్ 11కేవీ రైల్వేస్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ పేట, ఆంధ్రరత్న రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, రైల్వేస్టేషన్, వెహికల్ డిపో, పూర్ణానందంపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న మాజీ డెప్యూటీ మేయర్ నరసరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాల్లోని భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రిలకు సోమవారం ముత్యాలంపాడులో లోటస్ ఎస్ డెవలపర్స్ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ సొంతపూడి నరసరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు సామంతపూడి చిన్నా ముఖ్య అతిథులుగా పాల్గొని ఒక్కొక్కరికి రూ. 1,500 విలువ చేసే నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదల్లో సర్వం కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులకు తమవంతు సాయంగా నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్షత్రియ సేవా సంఘం కార్యదర్శి వీ విజయరామరాజు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు వీపీపీడబ్ల్యూఏ చేయూత



ఫొటోగ్రాఫర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రవికుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల కారణంగా నష్టపోయిన ఫొటో, వీడియో గ్రాఫర్లకు తమ అసోసియేషన్ అండగా ఉంటుందని విజయవాడ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(వీపీపీడబ్ల్యూఏ) అధ్యక్షుడు కమ్మిలి రవికుమార్ అన్నారు. గాంధీనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం వరద బాధిత ఫొటో, వీడియో గ్రాఫర్లకు నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల్లో నష్టపోయిన వారికి తమ వంతు సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫొటో అకాడమీ ప్రధాన కార్యదర్శి కే సుధాకర్‌రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, నగర, రాష్ట్ర అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో అభ్యంతరాల నమోదు

పటమట(విజయవాడతూర్పు): వరదలతో నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించేందుకు రూపొందించిన లబ్ధిదారుల జాబితాను 32 వార్డుల్లో ఉన్న సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. కండ్రిక, పాయికాపురం, ప్రకాష్ నగర్, వాంబే కాలనీ, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. లబ్ధిదారుల జాబితాలు, ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రజలు దాన్ని స్పెషల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్‌లకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సచివాలయాల్లోని వార్డ్ సెక్రటరీలు అభ్యంతరాలు నమోదు చేసుకుంటారని పేర్కొన్నారు.

తెరుచుకోని ప్లే స్కూల్ తలుపులు



విజయవాడస్పోర్ట్స్: రాజీవ్‌నగర్‌లోని వీఎంసీ ప్లే స్కూల్ తలుపులు తెరుచుకోవడం లేదు. బుడమేరు వరద ముంపు నుంచి కోలుకుని అన్ని ప్రాంతాల్లోనూ విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు పునప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే రాజీవ్ నగర్ ప్లే స్కూల్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ ప్రాంత వాసులు చెబుతున్నారు. వరద కారణంగా స్కూల్‌లో అక్కడక్కడా మేట వేసిన మట్టిని సైతం తొలగించలేదని, స్కూల్‌లోని ఆట వస్తువులు అలానే వదిలేశారని చెబుతున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా ప్లేస్కూల్‌ను శుభ్ర పరిచి ఉపయోగంలోకి తీసుకురావాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

తూతూమంత్రంగా ఎన్యూమరేషన్



ఎంజీ స్టేడియంలో మూసి ఉన్న 254వ వార్డు సచివాలయం వద్ద బాధితుల పడిగాపులు

పాయకాపురం(విజయవాడరూరల్) / అజిత్‌సింగ్ నగర్ (విజయవాడసెంట్రల్) / మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపునకు గురైన సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, శాంతినగర్, ప్రకాష్‌నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, ఉడాకాలనీ, కండ్రిక పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. అయితే బుడమేరు వరద బాధితులకు నష్ట పరిహారం చెల్లించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దోబూచులాడుతోంది. వరదల్లో ముంపునకు గురై సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారి జీవితాలతో ఆడుకుంటోంది. వరదల్లో పూర్తిగా నష్టపోయిన వారికి ఆర్థిక సహాయం చేసేందుకు ప్రభుత్వం నిర్వహించిన ఎన్యూమరేషన్ జాబితాల్లో బాధితుల పేర్లు లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

పేర్ల నమోదులో స్పష్టత కరువు

ప్రధానంగా వరద బాధితులకు ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం అనేది పూర్తిగా కొరవడింది. సచివాలయాల వద్ద కనీసం తమకు సమాధానం కూడా సరిగా చెప్పడం లేదని, తమ దరఖాస్తులు ఎవరికి ఇవ్వాలో.. ఏమి చేయాలో కూడా తెలియడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేమంటే సచివాలయాలే వద్ద వేచి ఉండమని చెబుతున్నారని.. ఎప్పుడు వస్తారో తెలీక అలానే పిల్లల్ని పట్టుకొని గంటల కొద్ది సచివాలయాల ఎదుట ఎదురుచూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాలకులు, ఉన్నతాధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

జాబితాలో పేరు లేదు



ఎన్యూమరేషన్ సిబ్బంది ఈనెల 9వ తేదీన ఇంటికి వచ్చి సర్వే చేశారు. సర్వే సందర్భంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు. అయితే లబ్ధిదారుల జాబితాలో నా పేరు లేదు. సర్వే సమయంలో వివరాలు సేకరించిన సిబ్బంది వెరిఫికేషన్ లిస్టులో చూడగా ఇంట్లో ఎవ్వరూ లేరని(డోర్ లాక్) మెస్సెజ్‌ని పేర్కొన్నారు. ఆ మెస్సెజ్‌ను చూసి ఆశ్చర్యపోయాం. – వై.కుమారి, ఓల్డ్ రాజీవ్‌నగర్

మ్యాపింగ్ కాలేదంటున్నారు



నా వయస్సు ఎనభై మూడేళ్లు. నా భర్త చనిపోవడం, పిల్లలకు పెళ్లిళ్లు కావడంతో ఒక్కదాన్నే ఉంటున్నాను. వరదల్లో మా ఇంట్లోని మంచం, టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ అన్ని పోయాయి. సర్వేలో మా ఇంటికి వచ్చిన వారికి పూర్తి వివరాలు ఇచ్చాను. కానీ ఇప్పుడు చూస్తే పేరు లేదు. అదేమని అడిగితే మ్యాపింగ్ కాలేదని చెబుతున్నారు. నేను పదేళ్ల నుంచి ఇక్కడే నివసిస్తున్నాను. ప్రభుత్వం న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నా.

– వల్లారపు దుర్గమ్మ, న్యూఆర్ఆర్‌పేట

సర్వేలో పూర్తి వివరాలు ఇచ్చాం



బుడమేరు వరదతో మా ఇల్లు ముంపునకు గురైంది. వరదతోపాటు పాములు, చెత్తచెదారం, విషసర్పాలతో తీవ్ర అవస్థలు పడ్డాం. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం. వరద సాయం అందితే ఎంతో కొంత ఉపయోగంగా ఉంటుందని చూస్తున్నాం. తీరా చూస్తే మా పేరు జాబితాలో లేదు అంటున్నారు. ఇన్ని కష్టాలు పడ్డ మా పేరు జాబితాలో లేకపోవడం ఇబ్బందిగా ఉంది. అధికారులు న్యాయం చేయాలి.

– వీవీఆర్ సురేష్, రామకృష్ణాపురం

కంపు కొడుతున్న మధ్యాహ్న భోజనం



విజయవాడస్పోర్ట్స్: బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లోని ప్రభుత్వ, వీఎంసీ పాఠశాలల్లో తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనం కంపుకొడుతోంది. పాఠశాలల్లోని స్టోర్ రూంలలోకి వరద నీరు చేరడం, అందులోని బియ్యం, ఇతర సరుకులు నీటిలో తడవడం, అవే సరుకులు, బియ్యంతో వంట చేయడంతో ఆహారం దుర్వాసన వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. స్కూల్లో వడ్డించే అన్నం తినలేక పోతున్నామని, అందుకే ఇంటి నుంచే అన్నం తెచ్చుకుని తింటున్నామని కొత్తరాజరాజేశ్వరిపేట కేర్ అండ్ షేర్ వీఎంసీ స్కూల్ విద్యార్థులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం స్కూల్లో ఇంటి నుంచి బాక్స్‌లో తెచ్చుకున్న భోజనం చేశారు. వరద నీరు పోయిన తరువాత స్కూల్ తెరిచిన నాటి నుంచి ఇదే విధంగా మధ్యాహ్నం భోజనం చేస్తున్నామని తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నివాసాల మధ్య నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై సోమవారం రాత్రి గుణదల పోలీసులు ఆకస్మిక దాడి చేసి నిర్వాహకురాలితోపాటు ఒక బాధితురాలు, విటుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ పప్పులు మిల్లు సెంటర్, రైల్వే ట్రాక్ పక్కన గల ఓ ఇంటిలో తమ్మిశెట్టి శివ శ్రావ్య వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ వాసిరెడ్డి శ్రీను సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో పట్టుబడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

27న సమ్మె విజయవంతం చేయండి

యూనియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం వద్ద ఉద్యోగుల ధర్నా



యూనియన్ బ్యాంక్ విజయవాడ జోనల్ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సమ్మెను విజయవంతం చేయాలని ఆలిండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు రాజేష్ కన్నా పిలుపునిచ్చారు. ఆలిండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ ఫెడరేషన్, బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న యూనియన్ బ్యాంక్ యాజమాన్యం అనుసరిస్తున్న బ్యాంకు ఉద్యోగుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆ బ్యాంక్ విజయవాడ జోనల్ కార్యాలయం ఎదుట సోమవారం సాయంత్రం సమ్మె సన్నాహక సభను, నిరసన నిర్వహించారు. భారీగా ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్‌కన్నా, విజయవాడ రీజినల్ సెక్రటరీ మణిగోపాల్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చాన్‌ఖాన్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కాలే శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. సోమవారం యూనియన్ బ్యాంక్ మేనేజమెంట్‌తో వివిధ ఉద్యోగ సంఘాలు జరిపిన చర్చలు విఫలమయ్యాయని చెప్పారు. దాని కారణంగా ఈ నెల 27న తలపెట్టిన యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సమ్మె అనివార్యమైందన్నారు. యూనియన్ బ్యాంక్ యాజమాన్యం ఇతర ఏ యాజమాన్యాలు అమలు చేయని నిరంకుశ, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులపై పని భారం ఎక్కువ అవుతుందన్నారు. రాత్రి ఎనిమిది గంటలు దాటినా ఇంటికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన చెందారు. సిబ్బంది కొరత కారణంగా ఖాతాదారులకు సరైన సేవలు అందించలేకపోతున్నామని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న సుమారు ఐదు వేల సబ్‌స్టాఫ్ ఉద్యోగాలు, ఇతర పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో చేసుకున్న ఒప్పందాలను బ్యాంకు గౌరవించాలని కోరారు. బ్యాంకుల్లో కాంట్రాక్టు ఉద్యోగాలను నిషేధించాలని, ప్రస్తుతం కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ విజయవాడ రీజినల్ సెక్రటరీ ఎస్.సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ఆనందకిషోర్, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో ఐరన్ స్క్రాప్ బహిరంగ వేలం



వేలంలో పాల్గొన్న అధికారులు, కాంట్రాక్టర్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిరుపయోగంగా ఉన్న ఐరన్ స్క్రాప్‌ను ఆలయ అధికారులు సోమవారం బహిరంగ వేలం ద్వారా విక్రయించారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన బహిరంగ వేలం పక్రియలో పలువురు కాంట్రాక్టర్లు హాజరయ్యారు. సుమారు 7 టన్నుల మేర ఉన్న ఐరన్ స్క్రాప్‌ను వేలంలో దక్కించుకునేందుకు ప్రథమ ధరావత్తుగా రూ. 50 వేలు చెల్లించారు. మొత్తం ఐదుగురు కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొన్నారు. ఐరన్ కిలో ఒక్కింటికి రూ.40 నిర్ణయించి వేలంను ప్రారంభించగా, ధర అధికంగా ఉందంటూ కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో దేవస్థానం కిలోకు రూ. 28 కు తగ్గించి పాటను ప్రారంభించింది. చివరకు కిలోకు రూ. 31 చొప్పున చెల్లించేందుకు మచిలీపట్నంకు చెందిన మణికంఠ ఓల్డ్ ఐరన్ స్టీల్స్ ముందుకు రావడంతో ఖరారు చేశారు. సూపరిండెంటెంట్ నగేష్ పర్యవేక్షణలో లీజెస్ విభాగం సిబ్బంది వేలం పక్రియ నిర్వహించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కార్మికులు రక్తతర్పణతో పోరాడి సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనం కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం బ్లాక్ డేగా పాటించాలని అఖిల భారత కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు రాణిగారితోటలోని వైట్ హౌస్ సెంటర్‌లో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం లేబర్ కోడ్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతూ కార్మికులపై మరింత పని భారాన్ని పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ రద్దు కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ, క్వారీల్లో జరిగిన మరణాలకు సంబంధించి యాజమాన్యాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేని పరిస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ప్రమాణాలు పాటించకుండా వివిధ ఫ్యాక్టరీలు యథేచ్ఛగా కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికుల దుస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. ఇసుక లేకపోవడంతో పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మీరావలి, సహాయ కార్యదర్శి బాజీ, జిల్లా నాయకులు రాజు, కాళీ, గోవింద, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు లోటు లేకుండా చూసుకోండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



వీఎంసీ ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ ధ్యానచంద్ర

కృష్ణలంక(విజయవాడతూర్పు): దసరా మహోత్సవాల్లో భక్తులకు ఎటువంటి లోటు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. పద్మావతి ఘాట్, కృష్ణవేణి ఘాట్, సీతమ్మ పాదాలు, పున్నమి ఘాట్, భవాని ఘాట్, గిరి ప్రదక్షిణ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. దసరా మహోత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సిన క్లాక్ రూమ్, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. క్లాక్ రూమ్ ఎక్కడెక్కడ పెడుతున్నారు తాత్కాలిక మరుగుదొడ్లు ఎక్కడ ఉండబోతున్నాయి, వాటి నిర్వహణ, ప్రజలకు తాగునీటి సౌకర్యం ఎక్కడెక్కడ కల్పిస్తున్నారు, భవానీ భక్తుల రెడ్ క్లాత్ కోసం ఏర్పాటు చేయాల్సిన కన్వేనర్ బెల్ట్ తదితర అంశాలపై అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారి సౌకర్యార్థం 9 ప్రాంతాల్లో 150 తాత్కాలిక మరుగుదొడ్లు, 6 క్లాక్ రూమ్స్, 25 ప్రాంతాల్లో తాగునీరు ఏర్పాటు, 1100 మంది పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య నిర్వహణ, వీఎంసీ ఏర్పాటు చేస్తుందన్నారు.

‘తల్లికి వందనం’ అమలు చేయాలని డిమాండ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు తల్లికి వందనం పథకం అమలు చేయాలని, ప్రతి విద్యార్థికి రూ. 15వేలు ఇవ్వాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడ హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి ఒక్కొక్కరికీ రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదన్నారు. పైగా మాట మార్చి ఇంట్లో ఒక్కరికే రూ.15వేలు ఇస్తామని జీవో ఇచ్చారన్నారు. ఎన్నికల్లో ఏదైతే చెప్పారో ఆ మేరకు ప్రతి విద్యార్థికి రూ. 15వేలు ఇచ్చి హామీ నిలబెట్టుకోవాలన్నారు. అదే విధంగా ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి రూ. 3వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.20లక్షల మంది వలంటీర్లను రూ. 10వేల వేతనంతో కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 26 నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా గాంధేయ మార్గంలో శాంతియుత నిరసనలు చేపడతామన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు ఎంవీ సుబ్బారావు, లంకా గోవిందరాజులు, లంకే సాయి, రాజీవ్, సింగంశెట్టి మోహన్ ప్రసాద్, కార్తీక్ పాల్గొన్నారు.

విజయవాడ రైల్వే ఉద్యోగులకు ‘జీఎం’ అవార్డులు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): రైళ్ల నిర్వహణలో లోపాలను గుర్తించి.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించిన విజయవాడ డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులు ‘జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డు–ఆగస్టు’ను అందుకున్నారు. సోమవారం రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సికింద్రాబాద్ నుంచి వర్చువల్ విధానంలో విజయవాడ డీఆర్‌ఎం నరేంద్ర పాటిల్, డివిజన్ల డీఆర్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని జీఎం సూచించారు. క్రమం తప్పకుండా అన్ని సెక్షన్‌లలో సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం రాజమండ్రి సీనియర్ టెక్నీషియన్ కె.శ్యామ్‌కుమార్, టెక్నీషియన్–1 వై.చంద్రకుమార్, హంసవరం పాయింట్‌మెన్ వై.ఆదినారాయణకు జీఎం అరుణ్‌కుమార్‌జైన్ అవార్డులు అందజేశారు.